# 21వ వారము - సభ్యుల విభాగము

## నామామృతం

"అది మనకు శాంతిని చేకూరుస్తుంది."

ప్రపంచ శాంతికి సూత్రం ఏమిటంటే భగవన్నామాలను జపించడం వంటి శులభ పద్ధతి ద్వారా కృష్ణ చైతన్యమును వృద్ధి చేయడం.

ఈ భూమి భగవంతుని సొత్తు. కాని జీవులు ప్రత్యేకించి నాగరికతను సాధించామనుకొనే మానవులు భగవంతుని సొత్తును తమదిగా చెప్పకొనుచున్నారు. వీరు వ్యక్తిగతంగా మరియు సామూహికంగా తప్పడు భావనలో ఉన్నారు. మీరు శాంతిని నెలకొల్పవలెనంటే ఈ రకమైన తప్పడు భావనను మీ మనస్సు నుండి మరియు ప్రపంచము నుండి పారద్రోలవలెను. మానవ జాతి యందు ఈవిధమైన తప్పడు యాజమాన్య భావం భూమిమీద శాంతి యొక్క అసమానతలన్నిటికీ పాక్షికంగా గాని లేదా పూర్తిగా గాని కారణము.

మూర్ఖులు మరియు నాగరికతను సాధించామనుకొనే మనుషులు భగవంతుడు లేడనుకునే విధంగా ఉండడం వల్ల భగవంతుని ఆస్తులపైన తమకు యాజమాన్యపు హక్కులు ఉన్నవని చెప్పచున్నారు. భగవంతుడు లేని సంఘమున మీరు శాంతియుతంగా మరియు సంతోషముగా ఉండలేరు. భగవద్గీతయందు శ్రీకృష్ణుడు అన్ని జీవులకు మంచిన కోరుకునే స్నేహితుడు తానే అని చెప్పెను. ఎప్పడైతే ప్రజలు దీనిని శాంతికి సూత్రముగా తెలుసుకొందురో అప్పటికప్పడే శాంతి స్థాపిత మవుతుంది.

అందువలన మీరు శాంతిని పొందాలనుకొన్న యెడల మీ చైతన్యమును వ్యక్తిగతంగాను మరియు సామూహికంగాను భగవంతుని పవిత్రనామములను జపించు సరళమైన పద్ధతి ద్వారా కృష్ణ చైతన్యముగా మార్చుకొనవలెను. ప్రపంచముల యందు శాంతిని సాధించుట కొరకు ఇది ప్రామాణికమైన మరియు గుర్తింపబడిన పద్ధతి. అందువలన ప్రపంచమున శాంతిని సాధించుట కొరకు మేము ఈ పద్ధతిని ప్రోత్సహిస్తున్నాము. అందువలన "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అని జపించుట ద్వారా మీరు కృష్ణచైతన్యులుగా మారండని మేము ప్రోత్సహిస్తున్నాము.

ఇది చాలా అభ్యాసయోగ్యమైనది, సరళమైనది మరియు పవిత్రమైనది. 480 సంవత్సరముల క్రితం శ్రీ చైతన్య దేవునిచే భారతదేశమునందు ఈ సూత్రము పరిచయము చేయబడింది. ఇప్పడు ఇది మీ దేశమున లభిస్తున్నది. పైన చెప్పబడిన సరళమైన ఈ జపించు పద్ధతిని గ్రహించండి. మీ నిజమైన స్థానమును భగవద్గీత యథాతథమును చదువుట ద్వారా తెలుసుకోండి. మరియు పోగొట్టుకున్న కృష్ణునికి మీకు గల సంబంధమును పునఃస్థాపితము చేయండి. వెనువెంటనే ప్రపంచము మొత్తమున శాంతి మరియు అభివృద్ధులు నెలకొండును.

*పంచతత్వ మంత్రమును జపించి తరువాత ఒక మాల జపాన్ని అనుసరించండి. శ్రీల ప్రభుపాదుల వారి జపాన్ని వెనుకగా ప్లే చేయండి. ఇది నిష్ఠతో, ప్రేరణాభావంతో జపం చేసేటట్లు ఆధ్యాత్మిక వాతావరణమును సృష్టిస్తుంది.*

# చర్చ - విషయ విభాగము

## ఆధ్యాత్మిక విద్య

పూజ్యులైన ఎ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు రచించిన భగవద్గీత యథాతథము నందు 12వ అధ్యాయము శ్లోకములు 6 మరియు 7ల నుండి గ్రహింపబడినది.

*యె తు సర్వాణి కర్మాణి మయి సం న్యస్య మత్పరాః*
*అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంతుపాసతే*
*తే షా మహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్*
*భవామిన చిరాత్పార్థ మయ్యావేశితచేతసాం*

"ఓ పార్థ! తమ కర్మలనన్నింటిని నాయందు విడిచి, అన్యచింత లేక నాయందలి భక్తియుక్త సేవలో నిమగ్నులగుచు, తమ మనస్సులను నాయందు స్థిరీకరించి, నన్నే ఎల్లప్పుడును ధ్యానించువారిని జనన మరణరూప సంసార సముద్రము నుండి సత్వరముగా రక్షింతును."

భౌతిక జీవితమునుండి భగవంతునిచే శీఘ్రముగా నుద్ధరింపబడుదురు. గావున, భక్తులు చాల అదృష్టవంతులని స్పష్టముగా చెప్పబడినది. విశుద్ధమయిన భక్తియుక్త సేవలో మానవుడు, భగవంతుడు మహత్తరుడనియు, జీవాత్మ అతనికి అధీనమ్మై యుండుననియు అనుభవపూర్వకముగా గ్రహించును. భగవంతునికి సేవచేయుట అతని విధి. అతడట్లు చేయనిచో "మాయ"కు సేవచేసిన వాడగును.

వెనుక చెప్పబడినట్లు భక్తియుక్త సేవచే మాత్రమే భగవంతుని మహత్మ్యము గుర్తింపబడును. అందుచే నెల్లరును భక్తిపరిపూర్ణులై యుండవలయును. కృష్ణుని పొందుటకై వారు తమ మనస్సులను కృష్ణునిపై సంపూర్ణముగా కేంద్రీకరింపవలెను. వారు కృష్ణుని కొరకే పనిచేయవలయును. వారు ఏరకమైన పనిలో నిమగ్నమైనను ఆ పనిని కృష్ణుని కొరకు చేయవలెను. అది భక్తియుత్త సేవకు ప్రమాణము. భక్తుడు దేవాదిదేవుని సంతృప్తిపరచుటకంటే మరి ఏ సిద్ధిని కోరడు. కృష్ణుని సంతృప్తిపరచుటయే భక్తుని జీవిత ధ్యేయము. అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామమున చేసినట్లు, అతడు కృష్ణుని సంతృప్తికై సర్వమును త్యాగము చేయగలడు. ఈ విధానము చాలా సులభమయినది. మానవుడు తన వృత్తిలో నిమగ్నుడై ఆ సమయముననే "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మంత్రమును జపించుట యందు కూడ నిమగ్నుడై యుండవచ్చును. అట్టి విశుద్ధ జపవిధానము భక్తుని దేవదేవుని కడకు ఆకర్షించును.

తన సేవయందే నిమగ్నుడైన విశుద్ధభక్తుని సంసార సముద్రమునుండి ఆలస్యము కాకుండ తాను సముద్ధరింతునని, అచట దేవదేవుడు వాగ్దానము చేయుచున్నాడు. యోగ సాధనలో అభివృద్ధి పొందినవారు స్వేచ్ఛా తమ ఆత్మను యచ్ఛ్ వచ్చిన లోకమునకు యోగవిధానముచే మార్పజాలుదురు. కాని భక్తునికి సంబంధించినంతవరకు అతనిని భగవంతుడే తీసికొనిపోవునని ఇచ్చట స్పష్టముగా చెప్పబడినది. ఆధ్యాత్మికాకాశమునకు తనను చేర్చుకొనుటకై ఎంతో అనుభవమును సంపాదించవలసిన అక్కర భక్తునకు లేదు.

వరాహపురాణము నందు ఈ క్రింది శ్లోకము కలదు:

*నయామి పరమం స్థాన మర్చిరాదిగతిం వినా*
*గరుడస్కంధ మారోప్య యథేచ్ఛమని వారితః*

ఈ శ్లోకము యొక్క సారాంశమిది: భక్తుడు తనయాత్మను ఆధ్యాత్మిక లోకములకు చేర్చుటకు అష్టాంగ యోగము నభ్యసింపనవసరములేదు. దేవదేవుడే ఈ బాధ్యతను గ్రహించును. తానే రక్షకుడనగుదునని అతడు స్పష్టముగా చెప్పుచున్నాడు. తల్లిదండ్రులు తమ బిడ్డ విషయమై పరిపూర్ణ శ్రద్ధ వహించుటచే అతని స్థితి సుఖకరముగ నుండును. అట్లే భక్తుడు తనను ఇతర లోకములకు చేర్చుటకు యోగాభ్యాసముచే ప్రయత్నింపవలసిన అవసరము లేదు. దేవదేవుడు అత్యంతమయిన అనుగ్రహముచే తన గరుడపక్షి వాహనముపై నెక్కి తటాలున వచ్చి వెంటనే భక్తుని సంసారము నుండి సముద్ధరించును. సంద్రమున పడిన మానవుడు ఈతలో ఎంత నేర్పరియైనను, రక్షింపబడుట కెంత యత్నించనను తనంతట తాను రక్షించుకోజాలడు. కాని ఎవరైనను వచ్చి నీటినుండి యతనిని పైకి తీసినచో అతడు సులభముగా రక్షింపబడును. అట్లే భగవంతుడు కూడ భక్తుని సంసార సముద్రమునుండి పైకి తీయును. దీనికి చేయవలసిన పని యొక్కటే. అతడు సులభమున కృష్ణ చైతన్య విధానము నభ్యసించుచు భక్తియుక్త సేవలో నిమగ్నుడైయుండుటయే. ఇతర మార్గము లన్నింటికంటే భక్తియుక్త సేవకే బుద్ధిమంతుడు ప్రాధాన్యమొసంగవలెను. "నారాయణీయము"న ఈ విషయము ఇట్టు సమర్థింపబడినది:

*యావై సాధన సంపత్తిః పురుషార్థచతుష్టయే*
*తయా వినా తదాప్నోతి నరో నారాయణాశ్రయః*

కామ్యకర్మలతో కూడిన ఇతర వివిధ విధానము లందుగాని, మానసిక కల్పనా విధానముచే జ్ఞానమును సంపాదించుటకు గాని మానవుడు నిమగ్నుడు కారాదని ఈ శ్లోకము యొక్క సారాంశము. దేవదేవుని యందు భక్తిగలవాడు ఇతర యోగవిధానము, మానసిక కల్పనము, కర్మాచరణము, యజ్ఞము, దానము మొన్నగువాని నుండి పొందగల లాభములన్నింటిని పొందజాలును. భక్తియుక్త సేవయొక్క ప్రత్యేకమయిన వరప్రసాదమిది.

"హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అని కృష్ణుని పవిత్ర నామమును జపించుటచే మాత్రమే భగవద్భక్తుడు సులభముగాను, సుఖకరముగాను దివ్యగమ్యమును చేరజాలును. ధర్మమునకు సంబంధించిన మరియేవిధానముచేతనైనను ఈ గమ్యమును చేరుట కష్టము.

భగవద్గీత యొక్క ఉపసంహారము అష్టాదశాధ్యాయమున ఇట్లు చెప్పబడినది:

*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ*
*అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః*

ఆత్మ సాక్షాత్కారమునకు సంబంధించిన యితర విధానము లన్నింటిని విడిచి, మానవుడు కృష్ణ చైతన్యముతో భక్తియుక్త సేవను మాత్రము చేయవలెను. అది అతనిని జీవితముయొక్క సంపూర్ణ స్థితికి చేర్చగలదు. దేవదేవుడు అతని సంపూర్ణ బాధ్యతను వహించును. గాన, పూర్వజన్మము నందలి పాపకార్యముల నాతడు పరిగణింపవలసిన యవసరము లేదు. అందుచే మానవుడు ఆధ్యాత్మికానుభవ విషయమున తనను రక్షించుకొనుటకు వ్యర్థముగా ఇతర ప్రయత్నములు చేయనవసరము లేదు. ఎల్లరును స్వశక్తిమంతుడును దేవదేవుడయిన కృష్ణుని శరణు పొందుదురుగాక! అదే జీవితము యొక్క అత్యున్నత పరిపూర్ణత్వము.

**కనుగొనండి :**

1. దేవదేవుని దగ్గరకు తిరిగి వెళ్లడానికి మనంతట మనము అర్హతను సంపాదించుకోవడానికి కృష్ణుడు ఏమి అడుగుచున్నాడు?

**అవగాహన :**

1. కృష్ణునికి గల సంబంధముపై మరియు అతనియందు గల ధర్మములపై విశుద్ధ భక్తుని యొక్క అవగాహన ఏమిటి?
2. కృష్ణునికి గల సంబంధముపై మరియు అతనియందు గల ధర్మములపై అవగాహనము పొందు స్థితికి మనము ఏవిధంగా చేరుకోగలమనుకొంటున్నాము?
3. భౌతిక లాభాల కొరకు యజ్ఞములను నిర్వహించుట, ఊహాకల్పనల ద్వారా జ్ఞానమును సముపార్జించుట, సిద్ధులను సాధించుట కొరకు అష్టాంగ యోగమును నిర్వహించుట మొదలైన ఇతర పద్ధతులను మనము ఎందుకని పాటించనవసరము లేదు?
4. ఇతర పద్ధతులతో పోలిస్తే విశుద్ధ సేవను అందించుట ద్వారా కలుగు లాభములు ఏమిటి?

**అనువర్తనము :**

1. ఈ శ్లోకముపై మీ అవగాహనను పాలుపంచుకోండి.

## ప్రచారమే సర్వసారము

పూజ్యనీయులు ఎ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు రచించిన "ప్రచారం చేయడమే సారాంశము" నుండి సంగ్రహించబడింది.

బ్రాహ్మణుడు తప్పకుండా ప్రచారం చేయవలెను:

సంఘము యొక్క వివిధ వర్ణములు మరియు ఆధ్యాత్మికాభివృద్ధి యందు స్థాయిలు అర్హతలను బట్టి నిర్ణయించబడుతున్నవి. వారి వివిధ లక్షణములను బట్టి నాలుగు వర్ణములు మరియు నాలుగు ఆశ్రమములు దేవదేవునిచేతనే సృష్టింపబడినవి భగవద్గీత యందు నిర్ధారణ చేయబడింది. దేహము యొక్క వివిధ అంగములు వివిధ పనులను కలిగి ఉంటాయి. అదే విధంగా వర్ణాశ్రమ ధర్మములు కూడా లక్షణములను మరియు స్థాయిలను బట్టి వివిధ పనులను కలిగి ఉంటాయి. వారి స్థానమును బట్టి వారు పని చేయాలి. ఈ విధంగా దేవదేవునిని తృప్తి పరచిన వారగుదురు లేకపోతే వారి స్థానముల నుండి పతనమగుదురు.

ఉదాహరణకు దేవదేవుని శిరస్సు నుండి జనించిన బ్రాహ్మణుడి పని దివ్యమైన వేద శబ్దములను, లేదా శబ్ద బ్రహ్మను, ప్రచారం చేయడం. బ్రాహ్మణుడు తల వంటివాడు కావున అతను దివ్య శబ్దములను ప్రచారం చేయాలి. మరియు అతను దేవదేవుని తరఫున భుజించాలి. వైదిక ఉపదేశముల ప్రకారము బ్రాహ్మణుడు తింటున్నప్పడు దేవదేవుడే ఆ బ్రాహ్మణుడి ద్వారా తింటున్నాడని అర్థం చేసుకోవాలి. అంతే కాని భగవద్గీతను ప్రచారం చేయకుండా దేవదేవుని తరఫున తినాలని కాదు. నిజానికి భగవద్గీత యందు నిర్ధారింపబడినట్లు భగవద్గీతను ప్రచారం చేసేవారు కృష్ణునికి అత్యంత ప్రీతిపాత్రులు, అటువంటి ప్రాచారకుడే నిజమైన బ్రాహ్మణుడు...